# తొలి అక్షరం


తెలుగు దిన పత్రిక

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 115 పేజీలు - 6 బుధవారం 19 మార్చి 2025


## ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకాన్ని కేంద్రం బలహీనపరుస్తోంది: సోనియా గాంధీ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 18:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓ పద్ధతి ప్రకారం గ్రామీణ ఉపాధి హామీ పథకం అయిన 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంజీఎన్ఆర్ఈజీఏ)2005'ను బలహీనపరుస్తోందని కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ మంగళవారం రాజ్యసభలో అన్నారు. శూన్యకాలంలో ఈ ప్రస్తావనను లేవనెత్తి ఈ పథకం కింద కనీస వేతనాన్ని రోజుకు రూ. 400 చేయాలని, 150 రోజుల పనిదినాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ పథకానికి కేటాయిస్తున్న మొత్తం రూ. 86,000 కోట్ల వద్దే స్తబ్ధుగా ఉండిపోయిందన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం వేతనాలు రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య తేడా కలిగి ఉందన్నారు. ఉత్తరాఖండ్‌లో రోజుకు రూ. 237గా ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో రోజుకు రూ. 300గా ఉందన్నారు.




# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

- ఆది నుంచి దళితులకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ
- దళితులను ముందువరసలో నిలిపింది కాంగ్రెస్ పార్టీయే
- ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి

**తొలి అక్షరం/హైదరాబాద్, మార్చి 18:** ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగింది. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ- వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం

వివరాలు 2లో

## చిన్నచిన్న కేసుల్లో బెయిల్ నిరాకరణలు

- ట్రయల్ కోర్టుల తీరుపై సుప్రీం అసహనం - ప్రజాస్వామ్యంలో పోలీస్ రాజ్యం కారాదని వ్యాఖ్య



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 18:** ట్రయిల్ కోర్టుల తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. చాలా సాధారణ కేసు ల్లో దర్యాప్తు పూర్తయినప్పటికీ బెయిల్ పిటిషన్లను తిరస్కరించడాన్ని అత్యున్నత న్యాయ స్థానం తప్పు బట్టింది.

వివరాలు 2లో

## నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

అంతకు ముందే కేబినేట్‌లో చర్చించి ఆమోదం




## కమీషన్ల మీదనే కాంగ్రెస్ దృష్టి

- హైడ్రా పేరుతో వసూళ్ల దందా
- పేదల ప్రతాపాలు.. పెద్దలతో ఒప్పందాలు : మాజీమంత్రి కేటీఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్, మార్చి 18:** అక్రమ వసూళ్ల కోసమే కాంగ్రెస్ పార్టీ హైడ్రాను తీసుకొచ్చిందని మాజీమంత్రి కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి.. కమీషన్లు ఎక్కడ వస్తాయో అక్కడ దృష్టి పెట్టిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. హైడ్రా పేరుతో వసూళ్ల దందా.. మూసీ పేరుతో పేదల ఇండ్లపై పగబట్టిందని విరుచుకుపడ్డారు కేటీఆర్. ఫార్మాసిటీ పేరుతో భూముల చెర.. ఫోర్త్ సిటీ పేరుతో సీఎం కుటుంబ రియల్ వ్యాపారం చేస్తుందని

వివరాలు 2లో

## సునీత విజయాల పట్ల భారత్ గర్విస్తోంది



- నీవు క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నాం
- భారత్‌లో పర్యటించాలని ఆకాంక్షిస్తున్నాం
- సునీతా విలియమ్స్‌కు మోడీ లేఖ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 18:** భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ కొన్ని నెలల ఎదురుచూపుల తర్వాత పుడమికి తిరిగి వస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందించారు. మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం అని సునీతకు లేఖ రాశారు. ఆమె సురక్షితంగా భూమిపైకి తిరిగిరావాలని, ఆరోగ్యంగా ఉండాలని మోదీ ఆకాంక్షించారు. సునీత సాధించిన విజయాల పట్ల 140 కోట్లమంది భారతీయులు గర్వంగా ఉన్నారని పేర్కొన్నారు. యూఎస్ పర్యటనకు వెళ్లినప్పుడు.. మీ గురించి అడిగి తెలుసుకున్నాను. మీరు వేలాది కి.మీ.దూరంలో ఉన్నప్పటికీ.. మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు. మీ అంతరిక్షయాత్ర విజయం సాధించాలని మేమంతా కోరుకుంటున్నాం. మీరు తిరిగి వచ్చిన తర్వాత మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం. తన కుమార్తెలకు ఆతిథ్యం ఇవ్వడం పట్ల భారత్ సంతోషంగా ఉంటుందని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. మార్చి ఒకటిన రాసిన లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు

వివరాలు 2లో

## ఓటరు కార్డుతో ఆధార్ అనుంధానం

అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం కీలక భేటీ




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 18:** ఓటరు జాబితాల తయారీలో అక్రమాలు జరిగాయంటూ విపక్షాలు తీవ్రస్థాయితో విమర్శిస్తున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆధార్‌తో ఓటరు కార్డు అనుసంధానంపై కీలక ప్రకటన చేసింది. ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం–1950, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే ఈ అనుసంధాన పక్రియ చేపట్టనున్నట్లు- తెలిపింది. ఇందుకోసం యూనిక్ ఐడెంటి ఫికేషన్ అథారిటీ- ఆఫ్ ఇండియా, ఈసీ సాంకేతిక

వివరాలు 2లో



## ఫోర్త్ సిటీ కాదు.. ఫోర్ బ్రదర్స్ సిటీ

- శంభీపూర్ వ్యాఖ్యలపై మండిపడ్డ శ్రీధర్ బాబు

**తొలి అక్షరం/హైదరాబాద్, మార్చి 18:** బిఆర్ఎస్ ఎంఎల్‌సి శంబిపూర్ రాజు, మంత్రి శ్రీధర్ బాబు మధ్య మాటల యుద్ధం నెలకొంది. శాసన మండలిలో ఎంఎల్‌సి శంబిపూర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కడుతోంది ఫోర్త్ సిటీ కాదు అని, ఫోర్ బ్రదర్స్ సిటీ- అని శంభీపూర్ రాజు అనడంతో శ్రీధర్ బాబు ఊగిపోయారు. సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని బాబు

వివరాలు 2లో

## పదేళ్లుగా దేవాదుల నిర్లక్ష్యం

- చర్చల లేని రోజే కెసిఆర్ వచ్చి వెళతారు
- మామూలు రోజుల్లో సభను ఎదుర్కొనే ధైర్యం లేదు
- దేవాదుల పంపులను ప్రారంభించిన మంత్రులు



**తొలి అక్షరం/హైదరాబాద్, మార్చి 18:** గత పదేళ్లు దేవాదులను నిర్లక్ష్యం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ ఉన్నప్పుడే దేవాదుల ఫేజ్ 1 పూర్తయిందన్నారు. మూడో ఫేజ్ పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేవాదుల పంప్ హౌస్ ఫేజ్ 3 లో భాగంగా నిర్మించిన మోటార్లను మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఆన్ చేశారు. ఒక మోటార్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పొంగులేటి..

వివరాలు 2లో

## హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్‌కు కోటి జరిమానా




**తొలి అక్షరం/హైదరాబాద్, మార్చి 18:** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సంచలన తీర్పు వెల్లడించారు. హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా విధిస్తూ సంచలన తీర్పునిచ్చారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన కేసు

వివరాలు 2లో

## డికె అరుణ ఇంట్లో చొరబడ్డ వ్యక్తి అరెస్ట్




## తాగునీటి సరఫరాలో సంక్షోభం లేదు

- శాసనమండలిలో మంత్రి సీతక్క వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్, మార్చి 18:** ప్రస్తుతం తాగునీటి సరఫరాలో ఎలాంటి సంక్షోభం లేదని మంత్రి సీతక్క తెలిపారు. నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడితే ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. మంగళవారం శాసన మండలిలో ఆమె మాట్లాడారు. భూగర్భ జలవనరులను కూడా సిద్ధంగా ఉంచామని, నీటి సరఫరాను అనునిత్యం పరిశీలిస్తున్నామని, నీటి సమస్యలపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ కూడా ఏర్పాటు- చేశామని వివరించారు. వేసవిలో నిరంతరం

వివరాలు 2లో

# నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

**- అంతకు ముందే కేబినేట్‌లో చర్చించి ఆమోదం**



**తొలి అక్షరం/హైదరాబాద్, మార్చి 18:** తెలంగాణలోని కాంగ్రెస్.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టనుంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో బుధవారం ఉదయం 11.14 గంటలకు ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను ముందుగా కేబినేట్ ఆమోదించాల్సి ఉంటుంది. దీంతో ఉదయం 9.30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కానుంది. అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రివర్గ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనుంది. అనంతరం బడ్జెట్ కాపీలతో భట్టి విక్రమార్క అసెంబ్లీకి చేరుకోనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండో బడ్జెట్ కావడం విశేషం. బడ్జెట్‌లో ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏ పథకానికి ఏ మేరకు కేటాయింపులు ఇవ్వబోతున్నదనేది ఆసక్తిగా మారింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంలో కీలక ప్రకటనలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఓటరు కార్డుతో ఆధార్ అనుంధానం

(మొదటి పేజీ తరువాయి)

నిపుణుల మధ్య త్వరలోనే చర్చలు ప్రారంభం అవుతాయని ఓ ప్రకటనలో పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బిర్ సింగ్ సందు, వివేక్ జోషీలు మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి, లెజిస్లేచర్ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, ఐటీ- శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈవోతో పాటు- ఈసీ సాంకేతిక నిపుణులతో సమావేశమై చర్చించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం.. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు- హక్కు ఉంటు-ంది. అయితే, ఆధార్ కేవలం వ్యక్తి గుర్తింపును మాత్రమే నిర్ధారించగలిగే పత్రం. అందువల్ల ఓటర్ల గుర్తింపు కార్డు (ఈఓఈ)ని ఆధార్‌తో అనుసంధానించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్లు 23(4), 23(5), 23(6) నిబంధనలు, 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా చేయాలని ఈ భేటీ-లో నిర్ణయించారు. ఇందులో భాగంగా యూఐడీఏ, ఈసీ -టె-క్నికల్ నిపుణుల మధ్య చర్చలు త్వరలోనే ప్రారంభం కానున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

## ఫోర్త్ సిటీ కాదు..ఫోర్ బ్రదర్స్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

హితువు పలికారు. శాసన సభలో ఇంతకంటే దారుణంగా మాట్లాడుతున్నారని శంబిపూర్ వివరణ ఇచ్చారు. వేరే సభ విషయాలు ఈ సభలో అనవసరమని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అనడంతో ఈ అంశం సద్దుమణిగింది.

## హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్‌కు కోటి జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

ఒకటి హైకోర్టు వద్ద పెండింగ్‌లో ఉంది. అయితే ఆ విషయాన్ని దాచిన పిటిషనర్ మరో బెంచ్ వద్ద కొత్త పిటిషన్ వేసి ఆర్డర్ తీసుకున్నాడు. ఈ విషయం ధర్మాసనం దృష్టికి రావడంతో జస్టిస్ నగేశ్ ఆగ్రహించారు. ఉన్నత న్యాయస్థానాన్నే తప్పుదోవ పట్టించడంపై మండిపడ్డారు. ఓ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా మరో బెంచ్ వద్ద రిట్ పిటిషన్ ఎలా వేస్తారంటూ ధ్వజమెత్తారు. ఈ మేరకు పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా విధించారు. కాగా, ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడే వారికి ఈ తీర్పు ఓ చెంప పెట్టు లాంటిదని పలువురు చర్చించుకుంటున్నారు. మరోవైపు జస్టిస్ నగేశ్ ఇచ్చిన తీర్పు ఇప్పుడు సంచలనంగా మారింది.

## ట్రిపుల్ ఆర్‌తో హైదరాబాద్‌కు మహర్దశ

**- రోడ్ల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి**

**తొలి అక్షరం/హైదరాబాద్, మార్చి 18:** ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్ మెంట్ చేసి కేంద్రానికి పంపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఆర్ఆర్ఆర్ గురించి కేంద్రమంత్రి గడ్కరీతో పలుమార్లు చర్చలు జరిపామని అన్నారు. ఆర్ఆర్ఆర్ పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. వాళ్ల మాదిరిగా తమకు రోడ్లు అమ్ముకునే అలవాటు లేదని బిఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. భూసేకరణకు సంబంధిoచి సహకరించాలని కోరుతున్నానని వెల్లడించారు. భూములకు మార్కెట్ ధర ప్రకారం చెల్లింపులు చేస్తామన్నారు. అధికారులపై దాడులు చేయించి అభివృద్ధిని అడ్డుకోవద్దని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరించారు. కేంద్రమంత్రి గడ్కరీని పలుమార్లు కలిసి చర్చించామని, మరో రెండు నెలల్లో అనుమతులు వస్తాయని అన్నారు. మూడు,నాలుగేళ్లలో దీనిని పూర్తి చేస్తామని అన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

సంతోషకరం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాం. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించాం. మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించాం. కమిషన్.. ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి గొప్ప విజయం లభించింది. ఇక, ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా ఉంటోంది. దశాబ్ధాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోంది. ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. బిల్లును ఎకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు నా కృతజ్ఞతలు. నేను ముఖ్యమంత్రిగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషం' అని అన్నారు. బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఎస్సీ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ సిఫార్సు చేసిన ప్రకారమే 3 గ్రూపులతో ఎస్సీ వర్గీకరణ బిల్లును రూపొందించింది. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ 1లో చేర్చారు. మొత్తం జనాభాలో వీరి జనాభా 3.288గా ఉంది. వీరికి 1 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. మధ్యస్థంగా లబ్ధిపొందిన 18 కులాలను గ్రూప్ 2లో చేర్చారు. వీరి జనాభా 62.748గా ఉంది. వీరికి 9శాతం రిజర్వేషన్ కల్పించారు. కాస్త మెరుగైన ప్రయోజనాలు పొందిన 26 కులాలను గ్రూప్ 3లో వేశారు. వీరి జనాభా 33.963గా ఉంది. వీరికి 5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఏ,బీ,సీ,డీ, కేటగిరీలుగా ఎస్సీ వర్గీకరణను చేసే అవకాశం లేదని కమిషన్ స్పష్టం చేసింది. ప్రభుత్వం.. కమిషన్ సిపార్సుతో పాటు- ఎపిరికల్ డేటాను దృష్టిలో పెట్టు-కుని న్యాయపర చిక్కులు రాకుండా ఉండేలా బిల్లును సిద్ధం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 1,38,78,078. వీరిలో మాదిగలు 67,02,609 ఉండగా.. మాలలు 55,70,244 మంది ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం మాలల జనాభా కంటే మాదిగల జనాభా 11.3 లక్షలు ఎక్కువ. ఎస్సీల్లో కేవలం ఈ రెండు కులాల జనాభానే 80 శాతం వరకు ఉంటు-ందని ఓ అంచనా. అందరికీ కలిపి 15 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ మొత్తం కోటాలో మాలలే ఎక్కువ లాభం పొందుతున్నారనే గొడవ దశాబ్దాల క్రితమే మొదలైంది. 1972 నుంచి మాదిగ వర్గానికి చెందిన నేతలు ముఖ్యమంత్రుల్ని కలుస్తూ వినతి పత్రాలు ఇస్తూ వచ్చారు. మంద క్రిష్ణ మాదిగ కూడా దీనిపై ఎప్పటినుంచో మాట్లాడుతున్నారు..' 1996 నాటికి మాదిగలు 18 వేల ఉద్యోగాల్లో ఉండగా, వాటిలో 80-90 శాతం నాల్గో తరగతి ఉద్యోగాలే. మరోవైపు, మాలలు అన్ని రకాలవీ కలిపి 72 వేల ఉద్యోగాల్లో ఉన్నారని అన్నారు.

# కమీషన్ల మీదనే కాంగ్రెస్ దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. ట్రిపుల్ ఆర్ పేరుతో పేదల భూముల ఆక్రమించుకుంటుందన్నారు. పేదలపై ప్రతాపం చూపిస్తూ.. పెద్దలతో ఒప్పందాలు కుదుర్చుకుంటుందన్నారు. నాడు మద్యం వద్దని చెప్పిన రేవంత్ రెడ్డి.. నేడు మద్యం ముద్దు అంటున్నారని పేర్కొన్నారు. ధరల సవరణ పేరుతో, కొత్త బ్రాండ్ల పేరుతో అక్రమ ఒప్పందాలు చేసుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు గాలికి వదిలేసి.. వాటిపై ప్రశ్నించిన వారిని జైలుకు పంపిస్తున్నారని తెలిపారు. రైతుభరోసా రాదు.. రుణమాఫీ కాదు.. పంటలు కొనుగోలు చేయరు.. రూ.500 క్వింటాలు ధాన్యానికి బోనస్ బోగస్ అయింది.. తులం బంగారం ఇయ్యరు.. ఉద్యోగాలు వేయరు.. ఉద్యోగులకు పీఆర్సీ రాదు, డీఏలు ఇవ్వరు అని కేటీఆర్ మండిపడ్డారు. సత్యం వధ.. ధర్మం చెర బట్టిందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశానికే దిక్సూచిగా ఎదిగిన తెలంగాణను.. 15 నెలల కాంగ్రెస్ పాలనలో అధం పాతాళానికి తీసుకెళ్లారు. ఆర్థికశక్తిగా ఎదిగిన తెలంగాణను ఆగం చేసి బీద అరుపులు అరుస్తున్నారు. ఇది పాలన కాదు పీడన.. ఇది సర్కారు కాదు సర్కస్ కంపెనీ అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. **కాంగ్రెస్ పాలనలో రైతన్నలను వెంటాడుతున్న కష్టాలు..** కాంగ్రెస్ పాలనలో రైతన్నలను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. సాగుకు సరిపడా విద్యుత్, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రైతు రుణమాఫీ కాక, రైతు భరోసా నిధులు విడుదల కాకపోవడంతో అన్నదాతలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఈ పరిస్థితులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ముంచుకొస్తున్న ముప్పును ముందే హెచ్చరించినా.. ఈ తెలివిలేని కాంగ్రెస్ సర్కారు తలకెక్కలేదు అని కేటీఆర్ విమర్శించారు. కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టొద్దని మొత్తుకున్నా విషం తప్ప విషయం లేని ముఖ్యమంత్రి వినిపించుకోలేదు. కళ్ల ముందే పచ్చని పంటలు ఎండుతున్నాయని వ్యవసాయ శాఖ సమర్పించిన ప్రాథమిక నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని కేటీఆర్ పేర్కొన్నారు. ఓవైపు రుణమాఫీ కాక, పెట్టుబడి సాయం రాక అన్నదాత అల్లాడుతున్న సమయంలో గోరి చుట్టు మీద రోకలి పోటులా పంటలు ఎండటంతో రైతు బతుకు ఆగమైంది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ కక్షగట్టి తెచ్చిన కరువు కాబట్టి రైతులను ఆదుకునే పూర్తి బాధ్యత ముఖ్యమంత్రిదే. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కూడా జరుగుతున్న ఎండిన ప్రతి ఎకరానికి వెంటనే రూ.25 వేల నష్ట పరిహారం ప్రకటించి వెంటనే చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తే రైతులతో కలిసి కాంగ్రెస్ సర్కారు భరతం పడతాం అని కేటీఆర్ హెచ్చరించారు. జై కిసాన్.. జై తెలంగాణ.. అని కేటీఆర్ నినదించారు.

## తాగునీటి సరఫరాలో సంక్షోభం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి కోసం రిజర్వాయర్ల నుంచి నీటిని సరఫరా చేస్తామని, నీటి సరఫరా అవసరాలకు 2024 జనవరి నుంచి ఇప్పటివరకు రూ.298 కోట్లు- మంజూరు చేశామన్నారు. 34 భారీ తాగునీటి సరఫరా పథకాల కోసం రూ.745 కోట్లు- కేటాయించామని, గ్రామాల్లో నీటి అవసరాల కోసం రూ.175 కోట్లతో ప్రతిపాదనలు పంపామని సీతక్క ప్రకటించారు.

## సునీత విజయాల పట్ల భారత్ గర్విస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ లేఖ పట్ల సునీత సంతోషం వ్యక్తంచేశారు. దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సునీతా విలియమ్స్, వ్యోమగామి బుచ్ విల్మోర్, మరో ఇద్దరు ఆస్ట్రోనాట్‌లతో కలిసి వారు భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు పుడమికి చేరుకుంటారని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించిన విషయం తెలిసిందే. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. వారం రోజులకే తిరిగి భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. నాటినుంచి సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌లోనే చిక్కుకుపోయారు. ఎట్టకేలకు వీరిరువురు తిరిగి భూమికి వస్తున్నారు. బుధవారం తెల్లావరుజామున వీళ్లు భూమ్మీదకు రానున్నారు. ఆమె ఆరోగ్యం బాగుండాలని దేశ ప్రజలు ప్రార్థిస్తున్నారని అన్నారు. తను అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్‌ని కలిసినా.. లేదా బైడన్‌ని కలిసినా.. ఆమె ఆరోగ్యం గురించి విచారించినట్లు పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయులు ఆమె సాధించిన ఘనతకు గర్వపడుతున్నారని తెలిపారు. ఆమె భర్త మైఖెల్ విలియమ్స్‌కి సునీతతో పాటు బుచ్ విల్‌మోర్‌కి కూడా ఆయన బెస్ట్ విషెస్ తెలియజేశారు.

## చిన్నచిన్న కేసుల్లో బెయిల్ నిరాకరణలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదని హితవు పలికింది. ఒక చిన్న కేసులో బెయిల్ కోసం దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదు. ఇక్కడ నిజాలతో సంబంధం లేకుండా చట్టం అమలుచేసే సంస్థలు కొందరు వ్యక్తులను నిర్బంధించేందుకు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తారు. అలా చేయడం ఆమోదయోగ్యం కాదు. రెండు దశాబ్దాల క్రితం.. చిన్న కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టులకు చాలా అరుదుగా వచ్చేవి. ట్రయిల్ కోర్టు స్థాయిలో పరిష్కారం కావాల్సిన కేసులకు సంబంధించి బెయిల్ పిటిషన్ల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడమనేది దిగ్భ్రాంతి కలిగిస్తోంది. దర్యాప్తు పూర్తయి ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ నిందితుడి బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించాయి. మేజిస్ట్రేట్లు విచారించగలిగే కేసుల్లో బెయిల్ విషయాలను సుప్రీంకోర్టు ముందుకు తీసుకు రావడం దురదృష్టకరమని అభయ్ ఎస్ ఓకా అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. చిన్నచిన్న నేరాలకు సంబంధించిన కేసుల్లోను బెయిల్ మంజూరుచేయడంలో ట్రయల్ కోర్టులు, హైకోర్టులు మరింత ఉదారవాద వైఖరితో వ్యవహరించాలని సూచించింది.

# రిజర్వేషన్ల పోరాటానికి ముందుండి నాయకత్వం వహిస్తా...

**● తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**



**తొలి అక్షరం/హైదరాబాద్, మార్చి 18:** బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు జరిగే పోరాటానికి ముందుండి నాయకత్వం వహిస్తానని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా, నిబద్ధతతో నిర్వహించిన కుల సర్వేను తప్పుబడితే బీసీలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని విడమరిచి చెప్పారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును శాసనసభ ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్రంలోని ఆయా బీసీ సంఘాలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2026లో జరిపే జన గణనలో కులగణన చేర్చాలని శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. మనం అందరం కలిసి కొట్లాడితే కుల గణనను ఎందుకు చేర్చరు. కొట్లాడితే తెలంగాణ రాలేదా? కొట్లాడితే దేశానికి స్వతంత్రం రాలేదా? కొట్లాడితే జన గణనలో కుల గణన ఎందుకు చేర్చరు. జన గణనలో ఒకసారి కులగణన చేర్చితే ఆ తర్వాత ప్రతి పదేళ్లకోసారి మరింత స్పష్టత వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. ఈ ప్రక్రియలో భాగస్వాములం కావడం మాకు గర్వకారణంగా ఉంది. దీన్ని తప్పుబడితే బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుంది. బలహీన వర్గాలు తమ హక్కుల సాధన కోసం చేసే పోరాటానికి పూర్తి మద్దతుగా నిలబడుతా. ఈ సర్వే పునాది లాంటిది. పునాదిలోనే అడ్డుపడితే మీకు మీరే అన్యాయం చేసుకున్న వారవుతారు. ముందు అమలు చేసుకుని తర్వాత అవసరాన్ని బట్టి సవరణలు చేసుకోవచ్చు. ఈ కుల గణన అందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటిది. కులం ముసుగులో రాజకీయంగా ఎదగాలని భావించే వారి ఉచ్చులో పడొద్దని హితవు చెప్పారు.

# పదేళ్లుగా దేవాదుల నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం కమీషన్ల కోసమే తాపత్రయపడింది కానీ.. ప్రాజెక్టును పట్టించుకోలేద న్నారు. సాగునీటి సమస్యకు గత ప్రభుత్వమే కారణమని విమర్శించారు. మిషన్ భగీరథ పేరుతో 39 వేల కోట్లు- ఖర్చు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సమాధానం చెప్పాల్సి ఉంటది కాబట్టే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదన్నారు. చర్చ లేనిరోజునే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని ఎద్దేవా వేశారు పొంగులేటి. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అసెంబ్లీని ఫేజ్ చేసే దమ్ములేదు.. అందుకే చర్చ లేని సమయంలో.. బడ్జెట్ చదివే సమయంలో అసెంబ్లీకి వచ్చిపోతున్నారని మండిపడ్డారు. ఇవాళ రాష్ట్రంలో ఉన్న నీటి ఎద్దడికి కారణం కేసీఆరే.. కేసీఆర్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది.. కమీషన్ల కోసం శిలా ఫలకాల కోసమే కొత్త ప్రాజెక్టులు తెచ్చారు.. దేవాదులను నిర్లక్ష్యం చేశారు ఆరోపించారు. ఇక, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనుకున్న దాని కంటే రైతులు ఎక్కువ సాగు చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతుల పంటల ఎండిపోకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నాం.. బడ్జెట్ సమావేశాల కంటే రైతుల సమస్యలే ముఖ్యమని వచ్చాం.. ఎంత పొద్దుపోయినా పంపు ఆన్ చేసి వెళతాం.. నాటి ప్రభుత్వం దేవాదుల పూర్తి చేసి ఉంట్నే ÷తులకు ఈ స్థితి వచ్చేది కాదు అన్నారు. ఇక, అంచనా వ్యయం పెరగడానికి కూడా కేసీఆర్ నిర్లక్ష్యమే కారణం.. తాగునీరు, సాగునీరు సమస్యకు గత కేసీఆర్ సర్కారే కారణమని ఆరోపించారు. ఒక లిఫ్టుతో ఆపరేట్ చేసినా 60-70 వేల ఎకరాల ఆయకట్టు-కు ప్రయోజనం చేకూరేది.. యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. దేవాదుల ఆయకట్టుకు నీరందించడం సంతోషంగా ఉందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. స్టేషన్ ఘన్ పూర్, జనగామ,పాలకుర్తి,పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లోని ఆయకట్టుకు నీరందుతుందన్నారు. గత పదేళ్లుగా దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మార్చి19 న దేవాదుల రావాలనుకున్నాం కానీ..బడ్జెట్ ఉండటంతో ఇవాళే వచ్చామన్నారు. హనుమకొండ జిల్లా దేవన్నపేట దగ్గర దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డికె అరుణ ఇంట్లో చొరబడ్డ వ్యక్తి అరెస్ట్




**తొలి అక్షరం/హైదరాబాద్, మార్చి 18:** భాజపా ఎంపీ డీకే అరుణ ఇంట్లో చొరబడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని దిల్లీకి చెందిన అక్రమ్‌గా గుర్తించారు. అతడిని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, జూబ్లీహిల్స్ పోలీసులు విచారిస్తున్నారు. ఎంపీ ఇంట్లోకి చొరబడేందుకు గల కారణాలను తెలుసుకుంటు-న్నారు. అక్రమ్ గతంలో హైదరాబాద్‌లోని పాతబస్తీ, దిల్లీలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు- సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సీపీ సీవీ ఆనంద్ సోమవారం ఎంపీ ఇంటికి చేరుకుని వివరాలను సేకరించిన విషయం తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 56లోని ఎంపీ నివాసంలోకి నిందితుడు ముసుగు ధరించి ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించాడు. సీసీ కెమెరా వైర్లను కత్తిరించి, సుమారు గంట పాటు- ఇంట్లో తిరిగి అక్కడి నుంచి జారుకొన్నాడు. ఆమె కుమార్తె ఉదయం నిద్రలేచి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉంది. వంట గది కిటికీ గ్రిల్ తొలగించడం గమనించారు. దీనిపై ఎంపీ డ్రైవర్ లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## నూతన వధూవరులని ఆశీర్వదించిన
# నెక్కొండ మార్కెట్ చైర్మన్
### - రావుల హరీష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు భక్కీ అశోక్



**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 18:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని పెద్దకొర్పోల్ గ్రామం రేకుల తండ కి చెందిన బాదావత్ చంద్రశేఖర్ –బిందు ల వివాహ వేడుకకి హాజరై నూతన వధూవరులని ఆశీర్వదించిన, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కుసుమ చెన్నకేశవులు, నెక్కొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గై లక్ష్మణ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమన్న, వెంకటేష్,బొడ్డుపల్లి యాదగిరి,తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినిలకు మోటివేషన్ తరగతులు
### - ఇంపాక్ట్ ట్రైనర్ రవిశంకర్ శ్రీరాములు



**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 18:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధి లోని కేజీబీవీ నందు అందరి విద్యార్థినులకు పరీక్షల ఒత్తిడిని ఎలా జయించాలని, పరీక్షలలో ఎలా విజయం సాధించాలని , సమయాన్ని సద్వినియోగం ఎలా చేసుకోవాలని, ఎల్లప్పుడూ ఆత్మవిశ్వాసంతో ఉండాలని, మంచి స్నేహం పొందాలని, గురువు దారిలో నడవాలని, తల్లితండ్రుల ఆశలను, వీరి ఆశయాలుగా చేసుకొని ముందుకు సాగాలనే అంశాలపై ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ డాక్టర్ రవిశంకర్ శ్రీరాములు ఒక గంట పాటు తరగతి నిర్వహించి, విద్యార్థినులకు అవగాహన కలిగించారు.కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి ఏం రజిత, ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి అవగాహన సదస్సు ద్వారా విద్యార్థినులలో మంచి ఆలోచనలు కలిగి పరీక్షలకు సంసిద్ధులై ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని, స్పెషల్ ఆఫీసర్ వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపద్యాయునిలు పాల్గొని ఇంపాక్ట్ ట్రైనర్ రవిశంకర్ ని శాలువాతో సత్కరించారు.

# నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం
### - మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్

**తొలి అక్షరం/నర్సింహులపేట, మార్చి 18:** తెలంగాణ ప్రభుత్వం తెలంగాణలోని నిరుద్యోగుల కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 5 లక్షల మంది యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 6వేల కోట్లు కేటాయించబడిందని, ఈ పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని, మంగళవారం మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్ తెలియజేశారు. ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం ప్రతి లబ్ధిదారుకు రూ. 3 లక్షల వరకు ఆర్థిక సాయం అందించబడుతుంది. కేటగిరి ఒకటి, ఒక లక్ష వరకు రుణాలు, 80 శాతం రాయితితో కేటగిరి రెండు ఒక లక్ష నుండి రెండు లక్షల వరకు 70 శాతం రాయితీతో, కేటగిరి 3 రెండు లక్షల నుండి మూడు లక్షల వరకు 60 శాతం రాయితీతో రుణాలు అందుతాయని, దరఖాస్తు ప్రక్రియ మార్చి 17 నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడతాయని



ఆయన అన్నారు. దరఖాస్తు చివరి ఏప్రిల్ 5 వరకు ఉంటుందని తెలిపారు. ఎంపిక ప్రక్రియ ఏప్రిల్ 6 నుండి మే 31, వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. ఎంపిక చేయబడిన వారికి జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయబడునున్నారు ఈ పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్వ యం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని యువతి, యు వకులు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆయన అన్నారు.

# ఘనంగా పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు..

- కృషి నీవంతైతే విజయం నీకు దాసోహం అవుతుంది
- ఇష్టపడిచదవండి..విజయం మీవెంటే..: తహశీల్దార్ నాగరాజు










**తొలి అక్షరం/ నర్సింహులపేట మార్చి 18:** మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో వార్షికోత్సవా లను ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహశీల్దార్ నాగరాజు, ఎం.పీ.డీ.వో, కిన్నెర యాకయ్య, జడ్.పి.హెచ్.ఎస్ పెద్దనాగారం ప్రధానోపాధ్యాయురాలు, జానకి సుమన పాల్గొన్నారు, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ తహశీ ల్దార్ నాగరాజు మాట్లాడుతూ, ఈ పాఠశాల 1930లో భారతదేశ స్వాతంత్ర్యానికి ముందే స్థాపించబడినదని, సుమారు 95 సంవత్సరాల పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసించి ఎన్నో ఉన్నత శిఖరాలను, పదవులనుఅధిరోహించారని, విదేశాలలో సైతం స్థిరపడ్డారని, ఇంతటి ఘన చరిత్ర కలిగిన పాఠశాల వార్షికోత్సవాలలో పాల్గొనడం ఆనందంగా ఉన్నదని, పదవ తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక సంఘర్షణకు లోను కాకుండా ఇష్టపడి చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు,... అనంతరం ఎం.పీ.డీ.వో, కిన్నెర యాకయ్య మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశిస్తూ, తరగతి గదులలో గురువులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని త్వరలో జరగబోయే పదవ తరగతి వార్షిక పరీక్షలలో 10 / 10 జి.పి. ఏ సాధించి, జిల్లాలోనే పాఠశాల యొక్క పేరును ప్రథమ స్థానంలో నిలబెట్టాలని, చదువుకున్న పాఠశాలకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. పాఠశాలలో ప్రత్యేక అంశాలలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ విద్యార్థులకు తహశీల్దార్ నాగరాజు ఎంపీడీవో కిన్నెర యాకయ్య చేతుల మీదుగా విద్యార్థులకు మెమొంటోస్ బహుమతి ప్రధానం చేశారు, అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వి. వెంకటరెడ్డి, జి.రమాదేవి, కె. నరేందర్, డీ.ఎస్. శంకర్ నాయక్, కే. లింగయ్య, కె. శేఖర్, వి.వర కుమార్, ఏ. కృష్ణ, ఎస్. రాజు, ఆర్. సునీత, డి. రాగిణి, ఎన్. సుజాత, జి. పద్మావతి, కె. ఎల్లారెడ్డి, టి. సమ్మరాజు, ఎండి. నాగు మీరా, డి. సుగుణమ్మ, జె. మంగీలాల్, పి. నవీన్, బి. వెంకన్న, వి. ప్రియాంక, కే. వెంకట్రాములు, అటెండర్ వెంకటలక్ష్మి, స్కావెంజర్లు సుజాత, మమత, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## విజ్ఞాన భారతి విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

- కృషినీ వంతు అయితే విజయం నీకు దాసోహం అవుతుంది
- పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్కినపల్లి సతీష్ కుమార్



**తొలి అక్షరం/పర్వతగిరి మార్చి 18:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం పరిధిలోని విజ్ఞాన భారతి విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్కెనపల్లి రజిత –సతీష్ కుమార్ లు విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్లు, స్కేలు,పెన్సిల్, తదితర పరీక్షకు సంబంధించిన సామాగ్రిని అందించడం జరిగింది. ఈ సందర్భంగా విజ్ఞాన భారతి విద్యాలయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్కెనపల్లి సతీష్ కుమార్ మాట్లాడుతూ “కష్టపడి చదవండి విజయం మీ వెంటే ఉంటుంది.ఇష్టపడి చదవండి చదువుకు ఎవరు భయపడాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరి లో టాలెంట్ ఉంటుంది. ప్రతి విద్యార్థిని,విద్యార్థులు పరీక్ష హాల్కు వెళ్లే క్రమంలో వారి యొక్క ఫ్యాడ్లు,సామాగ్రిని తప్పనిసరిగా తీసుకొని సక్రమంగా పరీక్ష విధానాన్ని కొనసాగించాలని, వారికి పరీక్ష హాల్లోని మెలకువలను సవివరంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు అంజద్ పాషా, అనిల్, అశోక్,సంపత్, రమేష్, సరిత సుధాకర్, సుమలత, లత,రాజేశ్వరి,లావణ్య, మిగతా ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# బీసీ బిల్లుకు ఆమోదం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలభిషేక కార్యక్రమం





**తొలి అక్షరం/నరసింహుల పేట మార్చి 18:** బీసీ రిజర్వేషన్ల సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏడాదిలోగా బీసీ రిజర్వేషన్లతో పాటు ఎస్సీ వర్గీకరణను పూర్తి చేస్తామని, నరసింహులపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ అన్నారు.మంగళవారం అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చర్చ జరిపిన సందర్భంగా 42 శాతానికి ఆమోదం తెలిపిన అసెంబ్లీ లో ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ప్రభాకర్ ఉపముఖ్యమంత్రి బట్టి డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు రామచంద్రనాయక్ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నర్సింహులుపేట మండల చౌరస్తాలో కార్యకర్తలతో కలిసి రమేష్ పాల్గొని పాలభిషేకం చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని రాహుల్ గాంధీ ఆనాడు హామీ ఇచ్చారు. మేం బాధ్యతలు చేపట్టగానే 4 ఫిబ్రవరి 2024 లో బీసీ కులగణన ప్రక్రియను మొదలు పెట్టాం. కులసర్వేలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని. తెలంగాణ సమాజం బలహీన వర్గాలకు రిజర్వేషన్ల విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారని సందేశం ఈ సభ ద్వారా పంపించాలనుకున్నాం. ఇందుకు సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు. బీసీ రిజర్వేషన్లు 37 శాతానికి పెంచాలని గత ప్రభుత్వం గవర్నర్ కు ప్రతిపాదన పంపించింది. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచేందుకు గత ప్రభుత్వం గవర్నర్ కు పంపిన ప్రతిపాదనను ఉపసంహరించుకుని కొత్త ప్రతిపాదన పంపించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.... ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు రామకృష్ణ గ్రామ కార్యదర్శి దోమల యాదగిరి జిల్లా యువజన నాయకులు చిర్ర సతీష్ గౌడ్ యూత్ కాంగ్రెస్ డోర్నకల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ యాదవ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ మండల యూత్ ఉపాధ్యక్షులు నాగబల్లి ముఖేష్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహబూబ్ ఖాన్ మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు అలవాల శ్రీనివాస్ ఎరనాగి రమేష్, కొంపెల్లి యకయ్య దూరు యాకయ్య, ఎర్ర రవి, పెద్ద నముల యకన్న రావుల యాకన్న రాములు సురబోయిన మల్లయ్య ఐలయ్య మధు ఉప్పలయ్య వెంకన్న అనీలు మల్లయ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి







**తొలి అక్షరం/పెద్దవంగర:మార్చి 18:** పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి పెద్దవంగర మండలంలో పలు గ్రామాలను సందర్శించి, ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలను, బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేసి, బాధిత కుటుంబాలకు మద్దతునిచ్చారు.పాలకుర్తి ఇంచార్జ్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి చిన్న వంగర గ్రామం, పోచారం గ్రామం, పెద్దవంగర మండల కేంద్రంలో బాధిత కుటుంబాలను ప్రత్యేకంగా పరామర్శించారు. వారి పరిస్థితిని దగ్గరగా తెలుసుకొని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ,“ఒక కుటుంబ సభ్యుడు మరణించడం వల్ల ఆ కుటుంబం ఎలాంటి కష్టాల్లో పడుతుందో మనకు తెలుసు. ఇలాంటి క్లిష్ట సమయంలో మనం వారికి అండగా నిలవాలి. బాధిత కుటుంబాలకు తగినంత సహాయం అందించేందుకు కృషి చేస్తాను. అని తెలిపారు.ఝాన్సీ రాజేందర్ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించడంతో పాటు, స్థానిక ప్రజలతో మాట్లాడారు. గ్రామస్తులు ప్రభుత్వం ఈ కుటుంబాలను ఆదుకోవాలని, పునరావాసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన వారు వారి సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లి, తక్షణ చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ మరియు మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్. ఉపాధ్యక్షులు మురళి.ప్రధానకార్యదర్శి సైదులు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు హరికృష్ణ. ఎస్టీ సెల్ అధ్యక్షులు. సీతారామ్ నాయక్. బీసీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్., స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామస్థులు ఝాన్సీ రాజేందర్ రెడ్డి భరోసాతో కొంత ఊరట పొందారు. గ్రామాలలో మౌలిక వసతుల సమస్యలపైనా వారు ఎమ్మెల్యే చర్చించి, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

# విద్యోదయ గురుకుల విద్యాలయంలో వీడ్కోలు సమావేశం

- పాఠశాల కరస్పాండెంట్ చల్లా నాగార్జున రెడ్డి






**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 18:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల విద్యాలయంలో వీడ్కోలు సమావేశం అంగరంగ వైభవంగా జరిగింది. త్వరలో జరగబోతున్న పదవ తరగతి పరీక్షలకు హాజరు కాబోతున్నటువంటి, పదవ తరగతి విద్యార్థులకు,9వ, తరగతి విద్యార్థులు వీడ్కోల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. పదవ తరగతి విద్యార్థులు వారి యొక్క అనుభవాలను వారి యొక్క సలహాలను సూచనలను 9వ,తరగతి విద్యార్థులకు ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చల్లా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు యొక్క తొలి మెట్టు పూర్తవుతున్న సందర్భంగా మరో మెట్టుకు వెళ్లే క్రమంలో విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు వెళ్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,కోరుకుంటూ 10వ, తరగతి విద్యార్థులు మనస్ఫూర్తిగా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరుకోవడం జరిగింది. పాఠశాల డైరెక్టర్ చల్లా పారిజాతం. ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎం డి షరీఫ్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని, ఈ యొక్క సమావేశాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె మోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నియోజకవర్గం ప్రజలు అభిమానులు**



**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చ్18:** మంచి మనసున్న మారాజు పిలవగానే పలికి మంచి స్వభావం గల వ్యక్తి కష్ట విలువ తెలిసిన మంచి వ్యక్తి షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ యువ నాయకుల అభిమాని, ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి, స్వయంకృషితో ముందుకు వస్తున్న వ్యక్తి, చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరికి తన వంతు సహాయం అందిస్తూ ముందుకు సాగుతున్న డైనమిక్ యువ నాయకుడు, పదిమందికి ఆదర్శంగా నిలుస్తూ,ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్న షాద్ నగర్ నియోజకవర్గనికి చెందిన తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందే మోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఇలాంటి పుట్టినరోజులు భవిష్యత్తులో మరెన్నో జరుపుకోవాలని ఆ దేవుడి యొక్క ఆశీస్సులు మీకు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ మీ షాద్ నగర్ అభిమానులు, నియోజవర్గ ప్రజలు, ప్రతి ఒక్కరూ ఆకాంక్షించారు.

## పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులను వెంటనే విడుదల చేయాలి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్**



**తొలి అక్షరం/ఫరూక్ నగర్ , మార్చ్18:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల మూడు వారాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు నియోజకవర్గ కన్వీనర్ శ్రీను నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆయన ఫరూక్ నగర్ మండలంలోని పీర్లగూడ.చించోడు. అయ్యవారిపల్లి గ్రామాలలో ఉపాధి హామీ పనిచేస్తున్న పని ప్రదేశంలో ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రటి ఎండలో పనిచేస్తున్న ఉపాధి హామీ కార్మికులకు పనిచేస్తున్నారని వారికి కనీస అవసరాలు తాగేందుకు నీళ్లు ఎండ నుంచి ఉపశమనం కలిగించుటకు టెంటును మరియు ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు అందించాల్సి ఉన్న ఏవేవి అందుబాటులో లేవు అదేవిధంగా ఉపాధి హామీ కార్మికులకు ఉపాధి కూలీ రోజువారి 300 నుంచి 800 పెంచి ఇవ్వాలని వారం వారం కూలి డబ్బులు వెంటనే ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వం డిమాండ్ చేశారు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని పేదలకు 12,000 అందరికీ వర్తింప చేయాలని. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లను కట్టించి ఇవ్వాలన్నారు కొత్తగా దరఖాస్తు చేసిన అందరికీ జాబ్ కార్డులను ఇచ్చి పని కల్పించాలన్నారు లేనిచో కార్మికులను. ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు ఉపాధి కూలీలు మల్లేష్ కిట్టు చంద్రకాంత్. శ్రీను యాదయ్య. శంకర్ నాయక్. శివ శంకర్ ఆంజనేయులు కృష్ణయ్య. రామచంద్రయ్య. ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.



## "అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ 3వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



**తొలి అక్షరం/నరసింహుల పేట మార్చి 18:** నరసింహుల పేట మండల కేంద్రంలో జిల్లా కమిటీ నాయకులు వాల్పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. సంఘం జాతీయ నాయకురాలు కామ్రేడ్ టాన్య అధ్యక్షతన మార్చి 21 నుండి 23 వరకు మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కేంద్రంలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్ బండపల్లి వెంకటేశ్వర్లు మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన అన్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ. దేశంలో బిజెపి మోడీ సర్కార్ నిరంకుశ వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చింది. ఈ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతాంగాన్ని నిర్బంధిస్తున్నది. చాలామంది రైతన్నల చావుకు కారణమైంది. ఈ నల్ల చట్టాలు రైతుల మెడపై వేలాడే కత్తి లాంటిది. రైతు పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. రైతాంగానికి సబ్సిడీలు, వ్యవసాయ రంగానికి మౌలిక వసతులు, సరైన మార్కెట్ వ్యవస్థ అసలే లేదు. వ్యవసాయ నల్ల చట్టాల కుట్ర ద్వారా బహుళ జాతి కంపెనీలకు, ఆదాని, అంబానీ, వేదాంత, జిందాల్ లాంటి వాళ్లకు వ్యవసాయాన్ని కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నది. ఈ కుట్రను రైతాంగమంతా తిప్పి కొట్టాలని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. అలాగే ప్రస్తుత ఈ వేసంగి సీజన్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నవి. రైతాంగం దిక్కుతోచని స్థితిలో పంటలను పశువులతో మేపుచున్నది. ప్రాజెక్టుల నీళ్లు విడుదల చేస్తున్నామని చెప్పినా, అవి అరకొరగానే ఉన్నాయి. చాలా చోట్ల పంటలు ఎండిపోతున్నాయి. కావున తక్షణమే పంటలను కాపాడి, రైతాంగానికి సబ్సిడీలు పునరుద్ధరించి, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు రేట్లు కల్పించి, వ్యవసాయాన్ని ఆదుకొని, రైతాంగాన్ని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జాటోత్ బిక్షపతి, శ్రీకాంత్, యాదగిరి, నరసింహ చారి, వెంకటయ్య, కమ్మ గిరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానల కన్నా అన్నదానం గొప్పది

**● ఘనంగా మనవరాలు కిన్నెర క్లింకార జన్మదిన వేడుకలు**

**● తాత నర్కుటి అబ్బ స్వామి ఆధ్వర్యంలో...**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) మార్చి 18:** అన్ని దానల కన్నా అన్నదానం గొప్పది అని నర్కుటి అబ్బా స్వామి అన్నారు.మంగళవారం నర్కుటి అబ్బా స్వామి లలిత దంపతుల కుమార్తె కిన్నెర కవిత భర్త మస్తాన్ కు జన్మించిన కుమార్తె కిన్నెర క్లింకార జన్మదిన వేడుకల సందర్భంగా అమ్మ ఒడి పెద్ద ముప్పారం అనాధ ఆశ్రమ లో అన్నప్రసాదం చేయడం జరిగింది ఈ సందర్భంగా నర్కుటి అబ్బ స్వామి మాట్లాడుతూ..నా కుమార్తె కవిత మస్తాన్ కు జన్మించిన కుమార్తె నా మనవరాలు కిన్నెర క్లింకార మొదటి జన్మదిన వేడుకలను అమ్మ ఒడి పెద్ద ముప్పారం అనాధ ఆశ్రమ లో అన్నప్రసాదం చేయడం చాలా సంతోషదగ్గ విషయాన్ని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా వారి పుట్టినరోజుల వేడుకలను అనాధ ఆశ్రమంలో జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయనమ్మ కిన్నెర సమ్మక్క తదితరులు పాల్గొన్నారు




# తొలగనున్న లింగగిరి అడ్డరోడ్డు ఇండ్లపై హైవోల్టేజ్ తీగల సమస్య

**● దొంతి మాధవరెడ్డి సహకారం మరువలేని**

**● కాంగ్రెస్ యువ నాయకుడు -మాదారపు చరణ్ కుమార్**



**తొలిఅక్షరం/మార్చి 18,(చెన్నారావుపేట):** తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి నర్సంపేట పలు సమస్యలపై మాట్లాడటం తో పాటు పేద ప్రజల ఇండ్లపై నుండి వెళ్తున్న హై వోల్టేజ్ వైర్లు తొలగించేందుకు నిధులు మంజూరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరగా రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ..నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి కోరినవన్నీ సంబంధిత శాఖ మంత్రుల కు సంబంధిత అధికారులను సమన్వయపరిచి వెంటనే నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. దీని ద్వారా లింగగిరి లోని ఎక్స్ రోడ్లో గల ఇళ్లపై హై టెన్షన్ వైర్ల సమస్య తొలగిపోయి శాశ్వత పరిష్కారాన్ని చూపుతుందని లింగగిరి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మాదారపు చరణ్ కుమార్.హర్షం వ్యక్తం చేయడం తో పాటు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై దొంతి మాధవరెడ్డి గళం

**● సానుకూల స్పందన తెలియజేసిన రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి**



**తొలిఅక్షరం/మార్చి 18,(నర్సంపేట):** అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వాన్ని ఎమ్మెల్యేదొంతి మాధవరెడ్డి నియోజక వర్గ సమస్యలపైఅదే విధంగా నర్సంపేట ప్రజల దాహం తీర్చేందుకు డీ ఫ్లోరైడ్ ప్రాజెక్ట్ మరమ్మతుకు నిధుల మంజూరు చేయాలి.పేదల ఇండ్లపై ఉన్న హై వోల్టేజ్ విద్యుత్ వైర్ల తొలగింపు చేపట్టాలి.తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ.. నర్సంపేట నియోజకవర్గంలో పాకాల సరస్సు నుండి అధికారికంగా 30 వేల ఎకరాలు అనధికారికంగా మరో 10 వేల ఎకరాలు రవి,ఖరీఫ్ రెండు పంటలు పండుతున్నాయని దాన్లో భాగంగా చివరి ఆయికట్టు వరకు మీరు వెళ్లడానికి కాలువల మరమ్మత్తు చేయాలని,తూముల లీకేజీ ద్వారా ఐదారు వేల ఎకరాలకు ఉపయోగ పడే నీరు వృధాగా పోతుందని వాటి మరమ్మత్తుకై నిధులు కేటా యించాలని గతంలో కోరామని ఉప ముఖ్యమంత్రి నుండి ఆమోదం పొందిన ఇంకా పనుల మంజూరు కి ఇవ్వలేదని వేసవిలో మరమ్మత్తులకు వాతావరణం అనుకూలంగా ఉంటుందని వెంటనే నిధులు మంజూరు చేయాలని, ఆయన కోరారు.నర్సంపేట పట్టణం దాదాపు 70 వేల మంది ప్రజలకు తాగునీరు అందించే ఉద్దేశంతో మిషన్ భగీరథ ఏర్పాటు చేసిన ప్పటికీ ప్రజలకు త్రాగునీరు పూర్తి స్థాయిలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.గత 20 సంవత్సరాల క్రితం నిర్మించిన డీ ఫ్లోరైడ్ ప్రాజెక్ట్ మరమ్మత్తు ద్వారా పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో దాహం తీర్చే అవకాశం ఉందని అట్టి పనులకు సైతం అంచనాలు పంపించామని, పేద ప్రజల ఇండ్లపై నుండి వెళ్తున్న హై వోల్టేజ్ వైర్లు తొలగించేందుకు నిధులు మంజూరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరగా రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ....నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి కోరినవన్నీ సంబంధిత శాఖ మంత్రుల కు సంబంధిత అధికారులను సమన్వయపరిచి వెంటనే నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

# బునియాడి కార్యకర్త సమ్మేళన్‌కి హాజరైన చల్లా నరసింహా రెడ్డి

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),మార్చి18:** వికారాబాద్‌లోని అనంతగిరి డౌన్ రోడ్‌లోని హరిత వ్యాలీ వ్యూ రిసార్ట్‌లో మంగళవారం తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బునియాడి కార్యకర్త సమ్మేళన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర టియూఎఫ్ఐడిసి కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహ రెడ్డి హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీఆర్ఐసిఓఆర్ ఆధ్వర్యంలో గిరిజన యువత అభివృద్ధికి కృషి చేస్తుందని కొనియాడారు.గిరిజన యువత అభివృద్ధి సవాళ్ల పై శిక్షణ ఉపన్యాసాలు ఇవ్వడానికి ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన ట్రైబల్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ని నరసింహ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వారి అనుభవంలో ఉన్న పలు సందర్భాలను అంశాలను,జాతిని జాగృతం చేసుకుంటూ అలాగే ప్రభుత్వాలు ఇచ్చేటువంటి పలు పథకాలను వినియోగించుకుంటూ విద్యాపరంగా, ఆర్థికంగా రాజకీయంగా ప్రతి రంగంలో ముందుండాలని వారు ఆకాంక్షించారు.వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ దూసుకోపోవలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి,వికారాబాద్ డిసిసి,పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి,ఏఐసిసి వార్ రూమ్ మాజీ ఇంచార్జ్ సంతోష్ కుమార్,ఏఐసీసీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రాహుల్ బాల్,స్థానిక నాయకులు,గిరిజనలు తదితరులు పాల్గొన్నారు.



## బాలాజీ మల్టీ హాస్పిటల్ సీజ్ చేసిన డాక్టర్ వి విజయలక్ష్మి డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ






**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చ్18:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పట్టణంలోని బాలాజీ మల్టీస్పెషల్టి ఆసుపత్రిలో "వైద్యం వికటించి వ్యక్తి మృతి" అని ఈరోజు వివిధ పత్రికలలో ప్రచురణమైన కథనానికి రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి వెంకటేశ్వరరావు స్పందించి, షాద్ నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి కు బాలాజీ హాస్పిటల్ ను సీజ్ చేయమని ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. జిల్లా వైద్యాధికారి ఆదేశానుసారము షాద్నగర్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వి విజయలక్ష్మి మరియు వారి టీం సభ్యులు బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కి వెళ్లి, నిన్న మృతి చెందిన సామ్య నాయక్ 50 సంవత్సరములు, కేశంపేట మండల్, కోనాయిపల్లి పరిధిలోని లచ్చుతాండకు చెందిన వ్యక్తి గురించి ఆసుపత్రి సిబ్బంది డ్యూటీ డాక్టర్ సింధు, డాక్టర్ అఖిల్ మరియు డాక్టర్ ఫైజల్ తో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి మాట్లాడి, పేషెంట్ యొక్క అడ్మిషన్ రిజిస్టర్ జిరాక్స్, పేషంట్ యొక్క కేసెట్ జిరాక్స్ మరియు పేషెంట్ కు సంబంధించిన ల్యాబ్ రిపోర్ట్ లు తీసుకొని ఆస్పత్రికి సీజ్ చేయడం జరిగింది. పేషంట్ కు ఇచ్చిన ట్రీట్మెంట్ గురించి మొత్తం రిపోర్ట్ తయారుచేసి జిల్లా వైద్య అధికారికి పంపిస్తామని తెలియజేశారు. జిల్లా వైద్యాధికారులు అన్ని అన్ని రిపోర్టును లను పరిశీలించి, ఆస్పత్రి సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటారని డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, హెల్త్ ఎడ్యుకేటర్ జె .శ్రీనివాసులు, ఉదయ్ కుమార్ ఫార్మసిస్ట్ మరియు వెంకటముని ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగుల కార్పొరేషన్‌ను చేర్చాలి

**● 5శాతం వికలాంగులకు కేటాయించాలి ● వికలాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి ● అశన్నగారి భుజంగరెడ్డి, జిల్లా అధ్యక్షులు జేర్కోని రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి**



**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చ్18:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025మార్చి 17నాడు ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ కార్పొరేషన్ లతో పాటు వికలాంగుల కార్పొరేషన్ ను చేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ కార్పొరేషన్స్ ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు 6000కోట్ల రూపాయలతో 5లక్షల మంది నిరుద్యోగులకు 1లక్ష నుండి 4 లక్షల వరకు లోన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం చేసింది. ఈ పథకం ద్వారా 25,000 మంది నిరుద్యోగ వికలాంగులకు మేలు జరుగుతుంది. 2016వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో 5శాతం ప్రత్యేకంగా వికలాంగులకు కేటాయించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఎక్కడ కూడా వికలాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తామని పేర్కొనలేదు. రాష్ట్ర ప్రభుత్వం మిగతా కార్పొరేషన్లకు ఇస్తున్న ప్రాధాన్యత వికలాంగుల కార్పొరేషన్ కు ఇవ్వడం లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం వలన వికలాంగుల కార్పొరేషన్ దివాళా తీసే పరిస్థితి ఏర్పడింది. రాజీవ్ యువ వికాసం పథకం అమలు కోసం విది విధానాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి. రాజీవ్ యువ వికాసం పథకం అమలు కోసం ఎస్సీ, ఎస్టీ, బిసి, కార్పొరేషన్స్ ఇచ్చిన నోటిఫికేషన్స్ ను సవరణ చేసి, వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు అయ్యేలా తిరిగి నోటిఫికేషన్ జారీ చేయాలి. వికలాంగులకు రిజర్వేషన్స్ అమలు చేయకుండా లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించడం అంటే వికలాంగులను మోసం చేయడమే అవుతుంది. రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగుల కార్పొరేషన్ ను చేర్చకుంటే ఉద్యమం చేస్తామని (ఎన్ పి ఆర్ డి) తెలంగాణ జిల్లా కమిటీ హెచ్చరిస్తుంది.

## మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు ఘన స్వాగతం

**తొలి అక్షరం/హనుమకొండ, మార్చి 18:** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్ మోటార్ల ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సాగునీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, తదితరులతో హెలికాప్టర్ ద్వారా దేవన్నపేటకు చేరుకోగా ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. దేవాదుల ప్యాకేజీ 3 లో భాగంగా నూతనంగా నిర్మించిన పంపు హౌస్ మోటార్లను ప్రారంభించేందుకు వచ్చిన రాష్ట్ర నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి , రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా దేవన్నపేటకు చేరుకోగా వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జి డబ్ల్యూఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, దేవాదుల అధికారులు పుష్పగుచ్చాలను అందించి ఘనంగా స్వాగతం పలికారు.



# ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీ

**● ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఉద్యమాలు, నిరసనలు నిషేధమా? ● ప్రజా పాలనలో తెలంగాణ ఉద్యమానికి ఊపిరినిచ్చిన ఆనాటి ఉద్యమ కేంద్రం ఉస్మానియా యూనివర్సిటీలో నేడు నిషేధాలు పెట్టడం సరికాదు. ● యూనివర్సిటీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. వెంటనే యూనివర్సిటీకి ఇచ్చిన సర్క్యులర్ను వెంటనే రద్దు చేయాలి ● అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్)(ఏ ఐఎస్ ఎఫ్)రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్**




**తొలి అక్షరం/షాద్ నగర్,మార్చ్18:** ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో ఎలాంటి నిరసనలు ధర్నాలు నిర్వహించరాదని ఉపకులపతి రిజిస్టర్ విడుదల చేసిన సర్కులర్ను వెంటనే వెనక్కి తీసుకోవాలిని అఖిల భారత విద్యార్థి సమైక్య డిమాండ్ చేస్తుంది. ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ మాట్లాడుతూ.. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ విశ్వవిద్యాలయం ఎన్నో పోరాటాలు త్యాగాలకు చిహ్నామని అన్నారు. తెలంగాణ ఉద్యమంతో ఎంతోమంది వీరులను సమాజానికి పరిచయం చేసిన ఉస్మానియా యూనివర్సిటీ నేల అని పేర్కొన్నారు. అటువంటి నేలపై నియంతృత్వ వైఖరితో ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా నిరాసనాలు ధర్నాలు నిర్వహించరాదని ఆదేశాలు జారీ చేయడం వారి నియంత పోకడకు నిదర్శమని విమర్శించారు. విద్యార్థి ఉద్యమాలకు ఆనచాలని చూస్తే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా ఇచ్చిన ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమైక్య డిమాండ్ చేస్తుంది అని ఆకాష్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ హెచ్చరించారు.

## అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లుకు అనుగుణంగా సీట్లు కేటాయించాలి

**● మాదిగల హక్కుల కొరకు నిరంతరం పోరాడుతాం ● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 9% రిజర్వేషన్ ఇవ్వడం హర్షణీయం- ఎంహెచ్‌పిఎస్ పక్షాన మాదిగల పక్షాన కృతజ్ఞతలు ● నామినేటెడ్ పదవులలో కూడా మాదిగలకు అవకాశం ఇవ్వాలి ● మాదిగ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్‌పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ**

**తొలి అక్షరం/హనుమకొండ, మార్చి 18:** మాదిగల రిజర్వేషన్ ప్రకారం రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కు అనుకూలంగా ప్రత్యేక సీట్లు కేటాయించాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి(ఎం హెచ్ పి ఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎం హెచ్ పి ఎస్) ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని, మాదిగ హక్కుల పరిరక్షణ సమితి(ఎం హెచ్ పి ఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ కేక్ కట్ చేసి స్వీట్ పంపించేశారు. ఈ సందర్భంగా మైస ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ.. మాదిగల హక్కులను సాధించే దిశగా కొన్ని దశాబ్దాల ఉద్యమ కాలంలో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి క్రియాశీలకంగా పనిచేసిందని, ఎం హెచ్ పి ఎస్ ఆవిర్భావం నుండి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ఎస్సీల రిజర్వేషన్ కోసం గల్లి నుండి ఢిల్లీ వరకు మాదిగ జేఏసీతో కలిసి కూడా పనిచేసి సంపూర్ణంగా విజయవంతం చేయడంలో ఎస్సీ ల వర్గీకరణ రిజర్వేషన్ సాధించడంలో ఎం హెచ్ పి ఎస్ క్రియాశీలకంగా పనిచేసింది అని అన్నారు. మాదిగలు దశాబ్దాల కాలం గా ఎస్సీల వర్కర్ల కోసం చేస్తున్న ఉద్యమాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మాదిగలకు 9% రిజర్వేషన్ అమలు చేయడానికి మాది హక్కుల పరిరక్షణ సమితి స్వాగతిస్తూ ముఖ్యమంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. గత ప్రభుత్వంలోని దళిత బంధం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ యొక్క పథకాన్ని అమలులో ఉంచాలన్నారు. మాది హక్కుల పరిరక్షణ సమితి ఎస్సీల వర్గీకరణ కొరకే కాకుండా అన్ని వర్గాల ప్రజల మేలుకొరకు ఎల్లప్పుడు వారితో అండగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. గత డిసెంబర్ నెలలో జరిగినటువంటి గ్రూపు-2 గ్రూప్-3 ఉద్యోగ నియామకాల్లో ఎస్సీల రిజర్వేషన్ అమలు చేసి మరోసారి మాదిగల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబడాలి అన్నారు. ఎస్సీల వర్గీకరణ మాదిగ అమరవీరుల విజయమని, వారిని ఎప్పుడు స్మరించుకోవాలన్నారు. మాదిగ అమరుల విగ్రహాలు ట్యాంక్ బండ్ దగ్గర ఏర్పాటు చేయాలని ఎం హెచ్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ అన్నారు. నామినేటెడ్ పదవులలో కూడా మాదిగలకు అవకాశం ఇవ్వాలిఈ కార్యక్రమము లో మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు బొల్లికొండ వీరేందర్ గజ్జల మల్లేష్, పుల్ల రమేష్ ఎం హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు (వరంగల్ జిల్లా) వంతడుపుల అవినాష్ కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, కందుకూరి ప్రభాకర్ ఎం హెచ్ పి ఎస్ హనుమకొండ(జిల్లా ఇన్చార్జి), మందా ఆరోగ్యం సిలుముల రాజు బరిగల బాబు ఒసేపాక రవి, మున్నా తదితరులు పాల్గొన్నారు.





## దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది..

**- ఎక్కడ లేని విధంగా కులగణన చేపట్టామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అసెంబ్లీలో అన్నారు**



**తొలి అక్షరం/గోదావరిఖని: మార్చి18:** దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో కులగణన పారదర్శకంగా చేపట్టారని అన్నారు. అన్ని పార్టీల నిర్ణయం మేరకు అసెంబ్లీలో కులగణనపై క్యాబినెట్ లో ఒక నిర్ణయం తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడిన వారికి అన్ని విధాలుగా అండదండగా ఉంటుందన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్రలో కులగణనపై ప్రత్యేక నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. తెలంగాణ దేశానికి రోల్ మోడల్ గా ఉందన్నారు. కుల గణన విషయంలో అసెంబ్లీ తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు.

## పేదింటి బిడ్డ పెళ్లికి చేయూత..



**తొలి అక్షరం/చెన్నూర్:** చెన్నూర్ పట్టణం కొత్తగూడెం కాలనీకి చెందిన నేన్నెల రజిత కుమార్తె వివాహం జరిగింది. వీరి ఆర్థిక పరిస్థితుల గురించి ఈ క్రింద తెలిపిన దాతలు దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగింది1) చెన్నూర్ ఎంఎల్ఏ ,2) మూల రాజిరెడ్డి,3) మేకల రామస్వామి , కారెంగుల రాములు వాకర్ అసోసియేషన్, 4) పెద్దింటి శ్రీను 5) నాయిని తిరుపతి ( ఫ్రూట్ షాప్ ),6) పెండ్యాల మధుసూదన్,7) ఎన్నం ప్రశాంత్ ( ఎల్ఐసి మరియు స్టార్ హెల్త్ ఏజెంట్),8) ఎన్నం ప్రకాష్ (సిద్ధివినాయక ఎంటర్ప్రైజెస్),9) రాంశెట్టి వెంకటేష్ ( మహాకాళి వాడ ),10) ఎన్నం సతీష్( బైక్ మెకానిక్ సెంటర్),11) గాదె బాపు (పద్మనగర్), 12) గుర్రం మహేష్ (పోస్ట్ ఆఫీస్),13) కుర్మ పున్నం గౌడ్ ( సినిమా టాకీస్),14) వొళ్ళాల సందీప్ ఆర్ టి ఏ కన్సల్టెంట్ ఏజెంట్ ) కొత్త బస్టాండ్,15) నారే వెంకటేష్ ( పద్మనగర్ బ్రిక్స్ ),16) అంబటి సురేష్ ( ఫిష్ సెంటర్),17) మామిడి సాయిచందు ( ఫోటో అండ్ వీడియో ఎడిటర్), మీరంతా మా ద్వారా పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందజేసినారు మీ అందరికి పేరు పేరునా ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి పాదాభివందనాలు తెలియజేస్తున్నాను భగవంతుడు వీరందరికీ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు కలుగజేయాలనీ అలాగే ఇలాంటి నిరుపేదలకు చేయూత అందించే శక్తిని ఇవ్వాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నానుఒడ్నాల రమేష్ మరియు ఒడ్నాల లక్ష్మి, తుమ్మ వంశీ కు ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

## వాహనం అదుపుతప్పి యువకుడు మృతి

**తొలి అక్షరం/చిట్యాల, మార్చి 18:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని లక్ష్మీపూర్ తండా గ్రామం వద్ద సోమవారం అర్ధరాత్రి పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పోతనవేన అజయ్ కుమార్(24) పనుల నిమిత్తం చిట్యాల మండలం వైపు వచ్చినట్లు చెప్పారు. ఈ క్రమంలో మండలంలోని ఒడితల గ్రామ ప్రధాన రహదారి నుండి భూపాలపల్లి మండలం మొరంచవైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లక్ష్మీపూర్ తండా గ్రామం తన వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు108 వాహనానికి కాల్ చేయగా. అంబులెన్స్‌లో భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించగా అప్పటికే అజయ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రవణ్ కుమార్ తెలిపారు.




# విష్ణుప్రియ, టేస్టీతేజకు నోటీసులు



బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో పంజాగుట్ట పోలీసులు విచారణను వేగవంతం చేశారు. యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్న బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోటు చేస్తున్న టీవీ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సహా మంది పోలీసులు సోమవారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ విష్ణుప్రియ, యూట్యూబర్, కమెడియన్ టేస్టీ తేజకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో ఆదేశించారు. విచారణ తర్వాత మరికొందరికి సైతం విచారణకు రావాలని నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేసిన ఇతర వ్యక్తులపై సైతం పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్స్, టీవీ నటుల్లో పలువురిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. యాంకర్లు విష్ణుప్రియ, శ్యామల, హర్షసాయి, ఇమ్రాన్ ఖాన్, టేస్టీ తేజ, కిరణ్ గౌడ్, రీతూ చౌదరి, సుప్రీత, సుధీర్, అజయ్, సన్నీ యాదవ్ పలువురిపై పలు సెక్షన్లతో పాటు యాక్టుల కింద కేసులు నమోదు చేశారు. ఇప్పటికే సేకరించిన యాప్స్ లింక్స్ ఆధారంగా పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నట్లు సమాచారం.


# అత్యధికంగా పన్ను చెల్లించిన బిగ్‌బీ



బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ కొత్త రికార్డు క్రియేట్ చేశాడు. అత్యధిక పన్ను చెల్లిస్తున్న సెలబ్రిటీగా చరిత్రకెక్కాడు. 2024-2025 సంవత్సరానికి బిగ్ బీ అమితాబ్.. సుమారు 120 కోట్ల ఆదాయ పన్ను చెల్లించారు. పన్ను చెల్లింపుల్లో ఆయన షారూక్ ఖాన్, విజయ్‌లను దాటేశారు. గత ఏడాది షారూక్ ఖాన్ 92 కోట్ల ట్యాక్స్ చెల్లించారు. అయితే ఇప్పుడు ఆ రికార్డును బాలీవుడ్ నటుడు అమితాబ్ చెరిపేశారు. 82 ఏళ్ల ఆ స్టార్ నటుడు 2024-25 సంవత్సరానికి 120 కోట్ల పన్ను కట్టారు. కల్కి 2898 ఏడీ, వెట్టియాన్ చిత్రాల్లో అమితాబ్ నటనపై ప్రశంసలు కురిశాయి. బ్రాండ్ ఎండోర్స్‌మెంట్లతోనూ బిగ్ బీ ఆర్జన రెట్టింపు అయ్యింది. కౌన్ బనేగా కరోడ్‌పతి సీజన్ 16 ద్వారా కూడా ఆయన ఆదాయం పెరిగింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వార కూడా అమితాబ్ తన ఆదాయాన్ని పెంచుకున్నది. చిత్రాలు, టాప్ బ్రాండ్లకు ప్రమోటర్‌గా అమితాబ్ అత్యధిక స్థాయిలో ఆర్జిస్తున్నారు. అయితే 2024-25 సంవత్సరానికి ఆయన సుమారు 350 కోట్లు ఆర్జించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన వ్యక్తుల్లో అత్యధికంగా ఆర్జిస్తున్న ఆర్టిస్టుగా అమితాబ్ నిలిచారు. పన్ను చెల్లింపుల్లో దేశ ప్రజలకు అమితాబ్ రోల్‌మోడల్‌గా ఉంటాడని ఓ వ్యక్తి తెలిపారు. సెక్షన్ 84, కల్కి 2898 ఏడీ సీక్వెల్‌లో కూడా అమితాబ్ నటిస్తున్నాడు.

# మహేష్‌బాబు సినిమాలో ప్రియాంకచోప్రా క్యారెక్టర్ లీక్..?


దర్శకధీరుడు రాజమౌళి, మహేష్ బాబు కాంబోలో ప్రస్తుతం ఎస్ఎస్ఎంబీ29 అనే చిత్రం స్లో అండ్ స్టడీగా చిత్రీకరణ జరుపుకుంటుంది. ఒడిశాలో ఈ మూవీ షూటింగ్ జరుపుకుంటున్నట్టు తెలుస్తుండగా, అక్కడ షూట్ ప్రారంభించిన మొదటి రోజే ఓ వీడియో లీక్ అయింది. జక్కన్న తీసిన సీన్స్ అన్ని లీక్ కావడంతో ఆయన షూటింగ్‌లో ఇప్పుడు చాలా స్ట్రిక్ట్ యాక్షన్ అమలు చేస్తున్నట్టు తెలుస్తుంది. అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ వార్త నెట్టింట హల్‌చల్ చేస్తుంది. ఇందులో ప్రియాంక చోప్రా ముఖ్య పాత్ర పోషిస్తుండగా, ఆమెని నెగెటివ్‌గా జక్కన్న చూపించబోతున్నట్టు సమాచారం. ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది ఇంకా అధికారిక ప్రకటన రాని నేపథ్యంలో ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. రాజమౌళి సినిమా అంటే ట్విస్ట్‌లు మాములుగా ఉండవు. ఏది చేసిన కూడా అది సంచలనమే అవుతుంది. ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ వార్తలలో నిజమెంత ఉందనేది తెలియాల్సి ఉంది. ఇక రాజమౌళి తన సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు కేవలం నటన, టెక్నికల్ అంశాల్లోనే కాకుండా సెట్ లో క్రమశిక్షణ మరియు పర్యావరణంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారనే విషయం మనకు తెలిసిందే. ఇది మరో సారి వెల్లడైంది. మహేష్ తో షూటింగ్ చేస్తున్న ఆ లోకేషన్ లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించారు. కఠిన నిబంధనలతో షూటింగ్ ఈ మూవీ సెట్ లో రాజమౌళి అమలు చేస్తున్నట్లు తెలుస్తుంది. హీరో మహేష్ బాబుకు ఇద్దరూ ప్రియాంక చోప్రా కు ఇద్దరు అసిస్టెంట్లకు మాత్రమే లొకేషన్లో పర్మిషన్ ఇవ్వగ మిగతా ఆర్టిస్టులకు ఒక్కొక్కరికి ఒక అసిస్టెంట్ మాత్రమే అనుమతిచ్చారట జక్కన్న. నిజానికి ప్రియాంక చోప్రా కు మేకప్ మరియు వ్యక్తిగత సహాయకులగా దాదాపు 13 మంది ఉంటారు కానీ ఈ సెట్లో కేవలం ఇద్దరికీ మాత్రమే అనుమతి ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ ఒడిశా లోని కోరాపూట్ జిల్లాలో జరుగుతుంది.



# అభినయకు కాబోయే భర్త విశాల్ కాదు..కార్తీక్



తమిళనాడుకు చెందిన అభినయ తెలుగు ప్రేక్షకులకి కూడా చాలా సుపరిచితం. అభినయ మొదటి తెలుగు సినిమా 2009లో వచ్చిన "నాడోడిగల్" మలయాళ సినిమాకు రీమేక్ అయిన "శంభో శివ శంభో". రవితేజ హీరోగా వచ్చిన శంభో శివ శంభో సినిమాలో అవకాశం దక్కించుకొని చాలా ఫేమస్ అయింది. అలానే సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో మహేష్ బాబు, వెంకటేష్ ల సోదరిగా కూడా నటించి ప్రశంసలు అందుకుంది. ఆమె నటనతో ఎంతోమంది ప్రేక్షకులను మెప్పించారు. కింగ్, దమ్ము, ధ్రువ, సీతా రామం, గామీ తదితర తెలుగు సినిమాలతో తెలుగు ప్రేక్షకులకి చాలా దగ్గరైన అభినయ .. మార్క్ ఆంటోనీ వంటి డబ్బింగ్ సినిమాలతోనూ తెలుగు ఆడియెన్స్ ని మెప్పించింది. అయితే కొద్ది రోజుల క్రితం అభినయ నిశ్చితార్థం చేసుకుంది. ఉంగరాలు మార్చుకొని, గుడిగంటలు కొడుతున్న ఫొటోని పంచుకుంది. దీంతో అభినయ పెళ్లి చేసుకోబోయే వ్యక్తి ఎవరు, ఆయన బ్యాక్‌గ్రౌండ్ ఏంటి అనే విషయాల గురించి ఆరాలు తీసారు. కొందరైతే విశాల్‌తో ఈ అమ్మడి వివాహం జరగబోతుందంటూ ప్రచారాలు చేశారు. కాని అభినయ కు కాబోయే భర్త పేరు కార్తీక్. కొద్ది రోజుల క్రితం ఇతని పుట్టిన రోజు సందర్భంగా ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలను షేర్ చేసి అందరిలో ఉన్న అనేక అనుమానాలని పటాపంచలు చేసింది.కార్తీక్.. హైదరాబాద్‌కి చెందిన వ్యక్తి కాగా, ప్రముఖ బిజినెస్ మ్యాన్ అని తెలుస్తోంది. హైదరాబాద్‌లోనే అతను పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇక అభినయతో అతనికి 15 సంవత్సరాల నుంచే పరిచయముందని, ఇద్దరూ ప్రేమలో కూడా ఉన్న నేపథ్యంలో ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయ్యారట. మరి పెళ్లి తేది ఎప్పుడు ప్రకటిస్తుందో చూడాలి. ఏది ఏమైన అభినయ పెళ్లి పీటలు ఎక్కుతున్ననేపథ్యంలో ఆమెకి ప్రముఖులు, నెటిజన్స్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# షారుఖ్‌ఖాన్‌తో సుకుమార్ సినిమా?

పుష్ప ది రూల్ సినిమాతో నేషన్ వైడ్ బ్లాక్ బస్టర్ అందుకున్నాడు దర్శకుడు సుకుమార్. అయితే ఈ ప్రాజెక్ట్ అనంతరం సుకుమార్ ఎవరితో సినిమా చేయబోతున్నాడా అని మూవీ లవర్స్ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ సినీ వర్గాల ప్రకారం సుకుమార్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ రామ్ చరణ్‌తో '17' చేస్తాడని అంటుండగా.. మరోవైపు 'పుష్ప 3' కథ రాసే పనిలో ఉన్నడని టాక్ వినిపిస్తుంది. ఇదిలావుంటే.. ఈ రెండు కాకుండా మరో క్రేజీ పాన్ ఇండియా కాంబో తెరమీదకు వచ్చింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్, దర్శకుడు సుకుమార్ కలిసి ఒక ప్రాజెక్ట్ చేయబోతున్నారని ప్రస్తుతం వార్తలు వైరల్ అవుతున్నాయి. వీరిద్దరు కలిసి ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ కోసం చేతులు కలపబోతున్నట్లు సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తుంది. ఒకవేళ ఇదే నిజమైతే సుకుమార్ పేరు బాలీవుడ్‌లో మారుమోగడం ఖాయం. రూరల్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ కథతో ఈ సినిమా రాబోతుండగా.. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమాలో షారుఖ్ ఖాన్‌ను విలన్ పాత్రలో చూపించే ఆలోచనలో సుకుమార్ ఉన్నట్లు సమాచారం. కాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# వరుస సినిమాలతో స్పీడ్‌పెంచిన రితికాసింగ్





చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుత్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. విక్టరీ వెంకటేశ్ నటించిన గురు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది హీరోయిన్ రితికా సింగ్. ఈ మూవీ తర్వాత అంతగా ఆఫర్స్ రాలేదు.. తెలుగులో పెద్దగా కనిపించక పోయినా తమిళ్ లో సినిమాలు చేస్తుంది. చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుత్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. ఇప్పుడు తెలుగుతోపాటు తమిళం, మలయాళం చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకుంటుంది. గురు సినిమా తర్వాత తర్వాత విజయ్ సేతుపతితో కలిసి ఆండవన్ కట్టలై, అలాగే రాఘవ లారెన్స్ సరసన శివలింగ సినిమాల్లో నటించింది రితిక. ఈ రెండు చిత్రాలు కూడా హిట్ గా నిలిచాయి. గురు తర్వాత నేరుగా మరే తెలుగు సినిమాలోనూ నటించలేదు రితిక. కేవలం నీవెవ్వరో అనే సినిమాలో కనిపించింది. ఇక ఈ ముద్దుగుమ్మ చివరిగా రజనీకాంత్ వెట్టయాన్ సినిమాలో నటించింది. వెట్టయాన్ చిత్రంలో కీలకపాత్ర పోషించింది. ఇందులో పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా ఆకట్టుకుందీ అందాల తార. సినిమాల సంగతి పక్కన పెడితే.. రితిక సోషల్ మీడియలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ చేసే వర్కౌట్లకు అభిమానులు, నెటిజన్లు ఆశ్చర్యపోతుంటారు. అలాగే కొన్ని క్రేజీ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది ఈ వయ్యారి భామ. తాజాగా రితిక షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.